క్లుప్తంగా

వితరణ



ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ గంగరాజు

కల్లూరురూరల్: పిడుగుపాటుతో ఎద్దు మరణించగా సదరు బాధిత రైతుకు పెద్దకోరుకొండి అంబేడ్కర్ యూత్ సేకరించిన రూ.21 వేల విరాళాన్ని ప్రముఖ వైద్యులు వేము గంగరాజు రైతు వినుకొండ దానియేలుకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు వేము రామకృష్ణ, వాడపల్లి పుల్లారావు, నాగరాజు, రాజేష్, వెంకటేశ్వర్లు, ఎర్రంరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్..



ట్రై సైకిల్ అందజేస్తున్న నాయకులు

పెనుబల్లి : జోనబోయిన ట్రస్ట్ ద్వారా సీపీఎం, సీఐటీయూ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, కె.అప్పారావు, హమాలీ వర్కర్స్ మిద్దె స్వామి, నాగయ్య, రాములు, ఎం.వెంకటేశ్వరరావు గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వైరాకు ప్రొఫెసర్ కోదండరామ్

వైరా: ప్రొఫెసర్ కోదండరామ్ బుధవారం వైరా రానున్నారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించనున్నారు. ఈ సభకు వామపక్ష పార్టీల ముఖ్య నాయకులు సైతం హాజరవుతారని, తెలంగాణ ఉద్యమకారులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీజేఎస్ నాయకుడు సంగమేశ్వర ప్రసాద్ కోరారు.

ఏపీ ఎప్‌సెట్‌లో 91వ ర్యాంక్



భరత్‌తేజ

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన విద్యార్థి నల్లబోతుల భరత్ తేజ మంగళవారం ప్రకటించిన ఏపీ ఎప్‌సెట్ ఫలితాల్లో 91వ ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే ఆయన తెలంగాణ ఎప్‌సెట్‌లో 162వ ర్యాంక్ సాధించాడు. సత్తుపల్లిలోని బోటని బాలాజీ విద్యాసంస్థలో పదో తరగతి చదివిన భరత్‌తేజను కరస్పాండెంట్ నల్లబోతుల నర్సన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు హేయం

తల్లాడ: ఏపీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు హేయమని వైఎస్సార్ అభిమానులు అన్నారు. మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దాడులను తీవ్రంగా ఖండించారు. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలనను ఆదర్శంగా తీసుకుని పరిపాలన చేయాలే తప్పా దాడులు సరైంది కాదన్నారు. షేక్ యాకూబ్‌పాషా, గోవిందు నరసింహారావు, రాగం రమణ, తాళ్ల ఆగస్టీన్, బొంతు వేణు, ఇండ్ల ఉదయ్ ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దోమల నివారణకు మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

తల్లాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని రోగాలకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం డీ వాటరింగ్, శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, వసంతకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

కారేపల్లి: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ అత్త వడ్డె తులిశమ్మ మంగళవారం మృతిచెందగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఇన్‌కంట్యాక్స్ కమీషనర్ జీవన్‌లాల్‌లు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, అజ్మీర వీరన్న, నాయకులు వెంకటేశ్వర్లు, ఉన్నం వీరేందర్, అడపా పుల్లారావు ఉన్నారు.

అద్దె గదుల్లో అంగన్‌వాడీలు

కొన్నిచోట్ల కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ

- మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు లేని వైనం
- పట్టించుకోని పాలకులు



బంజరలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం నిర్మాణం

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. చిన్నారుల సంక్షేమానికి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ శాఖ పనితీరు స్థానికుల విమర్శలకు గురవుతుంది. అద్దెగదుల్లో, కమ్యూనిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏ మాత్రం సదుపాయాలు లేవు. దీంతో చిన్నారులు, గర్భిణులు, తల్లులు సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఇబ్బందులు పాలులు పట్టించుకోవడం లేదు. మండలంలో మొత్తం 75 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల వయస్సున్న ప్రీ స్కూల్ విద్యార్థులు మొత్తం 1,100 మంది ఉన్నారు. గర్భిణులు 450 మంది, 470 మంది తల్లులున్నారు. 43 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలుండగా, ఎర్రుపాలెం, సఖినవీడు, బుచ్చిరెడ్డిపాలెం, నర్సింహాపురం, ఇనగాలి, పెద్ద గోపవరం తదితర గ్రామాల్లో అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. మిగతా చోట్ల 23 అంగన్‌వాడీ కేంద్రాలను కమ్యూనిటీ భవనాల్లో, కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అద్దె ఫ్రీ గదుల్లో నిర్వహిస్తున్నారు. బంజర, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు సంవత్సరాల తరబడిగా అసంపూర్తి భవన నిర్మాణాలుగా దర్శనమిస్తున్నాయి. అద్దె గదుల్లో, అద్దె ఫ్రీ గదుల్లో, కమ్యూనిటీ హాళ్లలో కూడా వసతులు లేవు. సొంత భవనాల్లో కూడా అరకొరగానే ఉన్నాయి. కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదు, ఫ్యాన్లు లేవు. ఎండ వేడిమికి చిన్నారులు మగ్గిపోతున్నారు. మరుగుదొడ్లు కూడా లేవు. గర్భిణులు, తల్లులు కనీసం కూర్చునేందుకు బల్లలు కూడా లేవు. కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితుల్లో 3–6 సంవత్సతరాలకు కనీసం ఫ్యాన్లు లేకుండా చిన్నారులు ఎలాగ ఉంటారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రుపాలెంలో అద్దెగదిలో నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అద్దె గదిలోనే నడుపుతున్నాం..



మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం అద్దె గదిలోనే నిర్వహిస్తున్నాం. తాగునీరు సక్రమంగా రావడం లేదు. మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ లేదు. అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మాణం చేస్తే మంచింది. సదుపాయాలు కావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఆశమ్మ, అంగన్‌వాడీ టీచర్, ఎర్రుపాలెం

కనీస వసతులు కల్పించాలి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి. అద్దె గదుల్లో చిన్నారులు మగ్గుతున్నారు. విధిగా భవన నిర్మాణాలు చేపట్టాలి. విద్యుత్ సౌకర్యం, ఫ్యాను, వంటగదులు, మరుగుదొడ్లు లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– నూతక్కి నర్సింహారావు, రేమిడిచర్ల

సమస్యలు ప్రభుత్వానికి నివేదించాం



పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేని విషయం నిజమే. గ్రామాల్లో అద్దె గదుల నిమిత్తం రూ.2వేలు చెల్లిస్తున్నాం. వసతులున్న గదులనే అద్దెకు తీసుకోవాలని సిబ్బందికి సూచనలిచ్చాం. చిన్నారులు, గర్భిణులు, తల్లుల ఆరోగ్యాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సమస్యలు ప్రభుత్వానికి నివేదించాం

– జి.కృష్ణశ్రీ, ఏసీడీపీఓ, ఎర్రుపాలెం

ఆర్టీసీ సేవలు అభినందనీయం



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఐ వెంకటేష్

కల్లూరు: ప్రయాణికులకు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని సత్తుపల్లి రూరల్ సీఐ నందగిరి వెంకటేష్ అన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలో కల్లూరు బస్టాండ్‌లో వేసవిలో ప్రయాణికులకు 70 రోజుల పాటు దాతల సహకారంతో అందించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, కూలింగ్ మినరల్ వాటర్ అందించడం గొప్ప విషయమన్నారు. మూడు నెలల పాటు తాగునీరు అందించిన ఆళ్లకుంట నరసింహారావును శాలువాతో సత్కరించి అభినందించారు. విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు సేవలను పురస్కరించుకుని కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సీహెచ్ కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ లక్కినేని రఘు, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, దారా రంగా, ఎస్‌కే.ఉస్మాన్, బైర్ల కాంతరావు, బొప్పన శ్రీనాథ్, దార్ల నరసింహారావు, ఆర్‌ఎంపీ వైద్యులు రాజు, కిషోర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది నగేష్, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి యూడీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో సర్వే చేసి బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా పంట బీమా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కందిమళ్ల ప్రసాద్, ముత్యాలు, కామేష్, ఆదినారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతులకు భరోసా ఇవ్వాలి

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని , కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వైరా మధు విద్యాలయంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. హామీలు ఎన్నికల అనంతరం గాలికి వదిలేశారన్నారు. అనంతరం మతం మతోన్మాదం అనే అంశం పై స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్ బోధించారు. సీపీఎం వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, సమత, హరి వెంకటయ్య, రామారావు, బత్తిరన్న, నరసయ్య, మోహనరావు, నరసింహారావు పాల్గొన్నారు

సర్వే పరిశీలన



వివరాలు సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

ముదిగొండ: మిషన్‌భగీరథపై మండలంలోని కమలాపురం, అయ్యగారపల్లి, బాణాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంపీడీఓ శ్రీధర్ స్వామి మంగళవారం పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఎంపీడీఓ సూచించారు.

బస్సు సర్వీస్‌లు పెంచాలి



ఆందోళన చేస్తున్న సంఘం నాయకులు

సత్తుపల్లిటౌన్: ప్రయాణికులకు సరిపడా బస్సు సర్వీస్సులు పెంచాలని డిమాండ్ చేస్తూ ప్రగతి శీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ, ప్రగతి శీల యువజన సంఘం పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం సత్తుపల్లిలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం డీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అసిస్టెంట్ మేనేజర్ విజయ శ్రీకి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, యువజన సంఘం డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు పరిమళ వెంకటనర్సమ్మ, కామేష్, వెంకటమ్మ, దుర్గా, అలివేలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వైరారూరల్: మండలంలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం పులిగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు


మంత్రి పొంగులేటి పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి: కాంగ్రెస్ నాయకురాలు బుక్కా కృష్ణవేణి కుమార్తె తేజస్వీ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా మంగళవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, బొర్రా కోటేశ్వరరావు, పిల్లి నవజీవన్, ప్రకాశ్, అలుగోజు రామనరసింహ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మధిర: మధిర పట్టణంలోని భరత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించి పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పూర్వ విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశంలో ప్రతిష్టాత్మకమైన క్యాంపస్‌లలో సీట్లు సాధించడంపై భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ శీలం విద్యాలత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు జిల్లా పూజిత జేఈఈ మెయిన్స్‌లో 99.41 పర్సంటైల్, అడ్వాన్స్‌డ్‌లో 11,369, ఓబీసీ విభాగంలో 2,578, తెలంగాణ ఎంసెట్ 431వ ర్యాంకు, రేగళ్ల సాయి కౌశిక్ రెడ్డి మెయిన్స్‌లో 99.75 పర్సంటైల్, అడ్వాన్స్‌డ్‌లో 13,799 ర్యాంక్, ఎంసెట్ 816వ ర్యాంకు, సిహెచ్ సాయి కుష్మిత మెయిన్స్‌లో 95.25 పర్సంటైల్, ఎంసెట్ 3,057 ర్యాంకు సాధించారన్నారు. ఈ మేరకు విద్యార్థులను సన్మానించి అభినందించారు. నాయకులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, విశ్వనాథం, సంగారావు, ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, డీన్ కటికల రవీందర్ రెడ్డి, శశికళ, నాగరాజు, అజీమ్, భవాని, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ

మధిరరూరల్: మండలంలోని నిధానపురం గ్రామ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఆలయం తాళాలు పగులగొట్టి దొంగతనం చేశారు. అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలను, హుండీలోని సొమ్ము దొంగతనం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

పనులపై విచారణ చేపట్టండి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి
- నాసిరకంగా చెరువుల ఆధునికీకరణ పనులపై ఆగ్రహం



వేశ్యకాంతల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, అధికారులు

సత్తుపల్లి: తామరచెరువు ఆధునికీకరణ పనులు నాసిరకంగా చేపట్టడంతో శిథిలావస్థకు చేరాయని, విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వేశ్యకాంతల చెరువు, తామరచెరువు, గాడిదవాగును ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రూ.3 కోట్లతో చేపట్టిన డ్రీడం పార్కు, చెరువుకట్ట ఆధునీకరణ పనులు కాంట్రాక్టర్ అధ్వానంగా చేసినా అధికారులు పర్యవేక్షణ ఎందుకు చేయలేదని నిలదీశారు. పార్కుకు వేసి టైల్స్ కింద సిమెంట్ లేకపోవటంతో అవి ఊడిపోయి పగిలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కు పనికిరాకుండా పోయిందని, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయిందని మండిపడ్డారు. మొక్కలు వేయకుండానే పార్కు నిర్మాణ పనులు పూర్తి అయినట్లు బిల్లులు చేసుకున్నారని, దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులకు నీళ్లు వచ్చేలా చేయండి..

వేశ్యకాంతల చెరువు తూము నుంచి సిద్ధారంవైపు వెళ్లే కాలువ పనులను లైనింగ్ చేసి రైతులకు నీళ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే రాగమయి ఆదేశించారు. కోర్టు వివాదంలో ఉన్న కాల్వల సమస్య పరిష్కరించే దిశలో అధికార యంత్రాంగం రైతులతో చర్చించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చెరువు ఆధునికీకరణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారని, చెరువు కట్టను ధ్వంసం చేయటంతో పొలాలకు వెళ్లే దారులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువు భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుందామన్నారు. ఎమ్మెల్యే వెంట డాక్టర్ మట్టా దయానంద్, ఇరిగేషన్ ఈఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, డీఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సొసైటీ వైస్ చైర్మన్ గాదె చెన్నారావు, రైతులు నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, నాగళ్ల ప్రసాద్, బత్తుల భరత్, దోమా ఆనంద్, పింగళి సామేలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు

వైరా: వైరా నియోజకవర్గ పరిధిలోని నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం శాంతినగర్ అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని మిట్టపల్లి గార్డెన్స్‌లో నాయీ బ్రాహ్మణుల వైరా నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ... నాయీ బ్రాహ్మణులకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి రుణ సదుపాయం వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణులు ఎమ్మెల్యే రాందాస్ ను గజమాల శాలువాతో సత్కరించారు. కుదురుపాక దర్గయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, వైరా టౌన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, కేఎంఆర్ హాస్పిటల్ అధినేత కుదురుపాక మోహనరావు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గజ్జెల వెంకన్న, దేవరకొండ శ్రీనివాసరావు, శ్రీరంగం, కుదురుపాక శ్రీహరి, శ్రీను, మురళి, వెంకన్న,రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కారేపల్లి: మండల పరిధిలోని పేరుపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల సతీష్ కుమారుడు చైత్రన్ అనారోగ్యానికి గురికాక వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.65 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే రాందాస్ నాయక్ బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సంతగుడి చైర్మన్ మల్లేల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం దారగాని రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 25, 26 తేదీల్లో మండలంలోని చిన్నగోపతిలో జరిగే మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కుటుంబరావు, నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, రోషన్ బేగ్, చినదానయ్య, అంజయ్య, విజయ, మాధవరెడ్డి, వెంకయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ములకలపాటి శ్రీనివాసరావు, లావణ్య, పల్లిపాటి కృష్ణ, కృష్ణవేణి, బిందుమాధవి, వైష్ణవి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, బొంతు మాధవరావు, పురుషోత్తం, రజిని, రాజ్యం పాల్గొన్నారు.

బడికి వేళాయె..

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం



కారేపల్లి: మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలు

సత్తుపల్లిటౌన్: వేసవి సెలవులు ముగిశాయి.. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో సత్తుపల్లి డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మంగళవారం పాఠశాలలను ముస్తాబు చేయటంలో నిమగ్నమయ్యారు. మండలంలోని 43 ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 హైస్కూళ్లు, ఒక ఎయిడెడ్ పాఠశాల ఉండగా వీటిలో 4,797 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలను ఎంపిక చేసి నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టారు. ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు ప్రజాప్రతినిధులతో అందించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అన్ని పాఠశాలలకు సామగ్రిని పంపిణీ చేశామని ఎంఈఓ బి.రాములు తెలిపారు.



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో బడిబాట

విద్యావనరుల కేంద్రానికి చేరిన పుస్తకాలు

కారేపల్లి: కారేపల్లి మండల విద్యావనరుల కేంద్రానికి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు చేరాయని మండల విద్యాశాఖాధికారి జయరాజు తెలిపారు. మంగళవారం ఎంఈఓ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ.. మండలంలో 86 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఆయా పాఠశాలల విద్యార్థులకు 21,500ల పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, 16,479 పుస్తకాలు మండల కేంద్రానికి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగీలాల్, సీఏ విజయ్‌కుమార్, మోతిలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మధిర: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు తెలిపారు. గుడివాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



మధిర: బడిబాట ర్యాలీ..



చింతకానిలో...